## ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో మజ్లిస్, బీజేపీ

సిటీబ్యూరో, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ ): జీహెచ్ఎంసీ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఇద్దరు అభ్యర్థులు నిలిచారు. బుధవారం ఉపసంహరణ గడువు ముగియడంతో ఎన్నికల పోరులో బీజేపీ, ఎంఐఎం పార్టీ అభ్యర్థులు ఉన్నట్లు ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి ప్రకటించారు. ఎంఐఎం పార్టీ నుంచి మీర్జా రియాజ్ ఉల్ హసన్ , బీజేపీ నుంచి డాక్టర్ ఎన్ గౌతం రావు ఎన్నికల్లో పోటీ పడుతుండగా..ఈనెల 23న పోలింగ్, 25న కౌంటింగ్ ప్రక్రియ జరగనుంది.

## సాలర్‌జంగ్‌లో మహవీర్ ఫొటో ప్రదర్శనశాల



జ్యోతి ప్రజ్వలన చేసి ఫొటో గ్యాలరీని ప్రారంభిస్తున్న ఆశిష్ గోయల్

చార్మినార్, ఏప్రిల్ 9: దేశ చరిత్ర ఎంతో ఘనమైనదని సాలర్‌జంగ్ మ్యూజియం డైరెక్టర్ ఆశిష్ గోయల్ తెలిపారు. మహవీర్ జయంతిని పురస్కరించుకొని మహవీరునికి చెందిన అత్యంత అరుదైన చిత్రపటాలను సందర్శకులు తిలకించిలానే ఉద్దేశ్యంతో మ్యూజియంలోని వెస్టర్న్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శన గ్యాలరీని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గోయల్ మాట్లాడుతూ.. ఏ దేశ చరిత్ర అయినా సంస్కృతి పై ఆధారపడి ఉంటుందని, అలాంటి చరిత్రను ప్రజలకు చేరువ చేసేందుకు ఇలాంటి ప్రదర్శనశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వారం రోజుల పాటు కొనసాగే ఈ ప్రదర్శనను ప్రజలు ఉచితంగా సందర్శించవచ్చని తెలిపారు.

## కవిత పోరాటంతోనే అసెంబ్లీలో బీసీ బిల్లు

### యునైటెడ్ పూలే ఫ్రంట్ కో కన్వీనర్ శివశంకర్




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న శివశంకర్

ఖైరతాబాద్, ఏప్రిల్ 9 : బీసీల కోసం సావిత్రిబాయి పూలే మాదిగిరిగా పోరాడుతున్న ఎమ్మెల్సీ కవితను విమర్శిస్తే సహించమని యునైటెడ్ పూలే ఫ్రంట్ కో కన్వీనర్ బి.శివశంకర్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొట్టల యాదగిరి ముదిరాజ్‌తో కలిసి మాట్లాడారు. అంబేద్కర్‌ను ఓడించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని, ఆ వర్గాలంటే ఆ పార్టీకి గిట్టదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కులవృత్తులు బలోపేతం చేసిందని, అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడిందన్నారు. ప్రపంచలోనే అత్యంత ఎత్తైన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించారని, రాష్ట్ర సచివాలయానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టిన చరిత్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ది అని అన్నారు. బీసీల ఉద్యమానికి ఎమ్మెల్సీ కవిత నిరంతరం అండగా నిలుస్తున్నారన్నారు. బీసీల గురించి మాట్లాడితే కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతుందన్నారు. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిలు ఏమైనా బీసీలా అని ప్రశ్నించారు. కవిత బీసీల కోసం పోరాటం చేస్తుంటే ఏ కాంగ్రెస్ బీసీ నేత మాట్లాడలేదన్నారు. ఆమె పోరాటాల ఫలితంగానే కాంగ్రెస్ సర్కారు అసెంబ్లీలో ఆ బిల్లు పెట్టిందన్నారు. అసెంబ్లీలో పూలే విగ్రహం పెట్టాలని కోరడంలో తప్పేముందన్నారు.

### బీసీ రిజర్వేషన్లపై రాహుల్ గాంధీ వైఖరి చెప్పాలి..

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్‌కు తొత్తుగా వ్యవహరిస్తున్నాడని, ఇంకా గవర్నర్ నుంచి ఎలాంటి సమాధానం రాకముందే ఢిల్లీకి వెళ్లి ధర్నా చేయడం హాస్యాస్పదమన్నారు. ముందు గవర్నర్ ఇంటి ముందు ధర్నా చేయాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై రాహుల్ గాంధీ వైఖరి చెప్పాలన్నారు. బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. బీసీల కోసం పోరాడుతున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమే అన్నారు. బీసీ బిల్లుపై బీజేపీ ద్వంద వైఖరి అవలంభిస్తోందన్నారు. బీసీలకు జనాభా దామాషాగా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొట్టల యాదగిరి ముదిరాజ్, ఓయూ జేఏసి నాయకులు డాక్టర్ కందుల మధు, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. విజయ్ రావు, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా నాయకులు బానోతు వెంకటేశ్ నాయక్, అశోక్ యాదవ్, పి. కుమారస్వామి రజక, వాడపల్లి మాధవ్, ఎస్. రమేశ్ కురుమ, డి. నరేష్, ఎత్తరి మారయ్య తదితరులు పాల్గొన్నారు.

# కలుషిత నీటితో జాగ్రత్త..

- నగరంలో పెరుగుతున్న డయేరియా కేసులు
- వాంతులు, విరేచనాల బారిన పడుతున్న ప్రజలు
- నాణ్యతా ప్రమాణాలు పాటించని ప్రైవేట్ ట్యాంకర్లు, ఆర్‌ఓ ప్లాంట్ల నిర్వాహకులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్య నిపుణులు




సిటీబ్యూరో, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): వేసవి కావడంతో ఎండలు దంచికొడుతున్నాయి. అదే సమయంలో చాలా ప్రాంతాలలో తాగునీరు లభించకపోవడంతో ప్రజలు ప్రైవేటు ట్యాంకర్‌లు, ఆర్‌ఓ ప్లాంట్ మినరల్ వాటర్‌పై ఆధారపడుతున్నారు. అయితే నగరంలో జలమండలి పరిధిలో సరఫరా అయ్యే నీటి నాణ్యతలో ఎలాంటి ఇబ్బందులు లేకపోయినప్పటికీ.. మెజారిటీ ప్రైవేటు ట్యాంకర్‌లు, ఆర్‌ఓ ప్లాంట్ల ద్వారా సరఫరా చేసే మినరల్ క్యాన్ల ద్వారా సరఫరా చేసే నీటి నాణ్యతపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఆ నీటిని తాగే ప్రజలు రోగాలబారిన పడుతున్నట్లు సమాచారం. గత పది రోజులుగా నగరంలోని చాలా చోట్ల డయేరియా కేసులు నమోదవ్వడమే దీనికి ఉదాహరణ. దీంతో ప్రైవేట్ ట్యాంకర్‌లు, మినరల్ వాటర్ క్యాన్‌లపై ఆధారపడి ఉన్న ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. కొంతమంది ప్రైవేటు ట్యాంకర్‌ల నిర్వాహకులు నీటి నాణ్యతపై ఎలాంటి శ్రద్ధ వహించకుండా ప్రజల డిమాండ్ మేరకు ఎలాంటి శుద్ధి చర్యలు తీసుకోకుండా బోర్ల నుంచి నేరుగా నీటిని నింపి సరఫరా చేస్తున్నారనే విమర్శలున్నాయి. అదే తరహాలో ఆర్‌ఓ ప్లాంట్లలో మినరల్ వాటర్ క్యాన్‌లు విక్రయించే వారు సైతం నీటి నాణ్యత విషయంలో ఎలాంటి ప్రమాణాలు పాటించడం లేదనే విమర్శలున్నాయి. అటు ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల విషయంలోగాని.. ఇటు మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వాహకుల విషయంలో గాని సంబంధిత అధికారుల సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కలుషిత నీరు తాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

### జ్యూస్‌లు, చల్లటి పానీయాలతో....

వేసవిలో దాహార్తిని తీర్చుకోవడానికి చాలా మంది రోడ్లపై విక్రయించే చల్లటి పానీయాలు, పళ్లరసాలు వంటి వాటిని ఎక్కువగా తాగుతుంటారు. అయితే వీటిని తయారు చేసే క్రమంలో వినియోగించే నీరు కలుషితమైతే డయేరియా వంటి వ్యాధుల బారిన పడే ప్రమాదం లేకపోలేదని హెచ్చరిస్తున్నారు వైద్యులు. పరిశుభ్రత లేనిచోట పానీయాలు, జ్యూస్‌లు తాగవద్దని సూచిస్తున్నారు. అలాగే వీధుల వెంట విక్రయించే పానీపూరి పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని పానీపూరిలో వినియోగించే మసాలా నీటి వల్ల డయేరియాకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. పరిశుభ్రత, స్వచ్ఛత లేని చోట ఎలాంటి ఆహార పదార్థాలుగాని, పానీయాలు గాని తీసుకోవద్దని సూచిస్తున్నారు.

### స్వచ్ఛమైన నీటినే తాగాలి

ప్రజలు తాగునీటి విషయంలో జాగ్రత్తలు వహించాలి. కలుషిత నీటి వల్ల డయేరియా వంటివి వస్తుంటాయి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు స్వచ్ఛమైన నీటినే తాగాలి. బయటి జ్యూస్‌లు, కూల్‌డ్రింక్స్ వంటి వాటికి సాధ్యమైనంత వరకు దూరంగా ఉండాలి. కొబ్బరి నీళ్ళు, తాజా పళ్ల రసాలు, మజ్జిగ వంటివి తీసుకోవడం ఉత్తమం. వాంతులు, విరేచనాలు వంటివి జరిగితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. అలాగే నీటిని కాచి, చల్లార్చి తాగడం ఉత్తమం.

**– డాక్టర్ రాజారావు, సూపరింటెండెంట్, యాదాద్రి భువనగిరి ప్రభుత్వ దవాఖాన**

## ఆటిజం పిల్లలకు ఉచిత స్క్రీనింగ్



వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 9 : ఆటిజం లక్షణాలు కలిగిన పిల్లలకు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని ఆటిజం సొసైటీ ఆఫ్ ఏపీ, తెలంగాణ వ్యవస్థాపకురాలు, అనన్య చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్ డైరెక్టర్ మాధవి ఆదిమూలం తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సైక్రియాటిస్ట్ డాక్టర్ శివ అనూప్ ఎల్లాతో కలిసి ఆమె మాట్లాడారు. ఆటిజంను ముందస్తుగా గుర్తించి చికిత్స తీసుకుంటే ఆ శిశువు ఆరోగ్యవంతంగా ఎదుగుతాడన్నారు. పుట్టినప్పటి నుంచి రెండేండ్ల లోపు చికిత్సకు తీసుకురావాలని, తద్వారీ స్పీచ్, ఆక్యుపేషనల్ థెరపీతో నయం చేయవచ్చన్నారు. ఆలస్యంగా జరిగితే కాలక్రమేనా వారి ఎదుగుదలపై ప్రభావం చూపుతుందన్నారు. ప్రపంచ ఆటిజం అవగాహన నెలగా గుర్తించిన ఇదే నెలలో పిల్లలకు ఉచిత స్క్రీనింగ్‌తో పాటు తల్లిదండ్రులకు సైతం కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. వివరాల కోసం 98485 13192 నంబరులో సంప్రదించాలని కోరారు.

# చల్లారని మంచు వివాదం

- జల్పల్లిలోని మోహన్ బాబు ఇంటికి మనోజ్
- లోనికి రాకుండా అడ్డుకున్న ప్రైవేట్ సిబ్బంది
- గేటు ఎదుట బైఠాయింపు



జల్పల్లిలోని మోహన్‌బాబు ఇంటి గేటు ఎదుట బైఠాయించిన మంచు మనోజ్

పహాడీషరీఫ్, ఏప్రిల్ 9: సినీ నటుడు మంచు మోహన్ బాబు కుటుంబ తగాదాలు మరోసారి రచ్చకెక్కాయి. అయితే వారి కుటుంబానికి సంబంధించి గత రెండు నెలలుగా ఎలాంటి గొడవలు తెరపైకి రాకపోవడంతో మోహన్‌బాబు పెద్ద కొడుకు మంచు విష్ణు తాను హీరోగా నటిస్తున్న కన్నప్ప సినిమా ప్రమోషన్లలో బిజీగా ఉంటున్నారు. మరో వైపు మనోజ్ కూడా సినిమా షూటింగ్లో బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో గతంలో జరిగిన కుటుంబ తగాదా వ్యవహారులు సద్దుమనిగాయని భావిస్తున్న తరుణంలో తాజాగా గురువారం ఉదయం హైదరాబాద్ జల్‌పల్లిలోని మోహన్బాబు ఇంట్లోకి వెళ్లడానికి మంచు మనోజ్ ప్రయత్నించగా.. అక్కడ భద్రత నిర్వహిస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ అతన్ని లోనికి రాకుండా అడ్డుకున్నారు. ఇటీవల జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో తన అనుమతి లేనిదే ఎవరూ లోపలికి రాకూడదని, ఇది నా ఆర్డర్ అనే హెచ్చరిక బోర్డును మోహన్ బాబు జల్‌పల్లిలోని ఇంటి గేటుకు ఏర్పాటు చేశారు. అయితే తాను లోపలికి వెళ్లేందుకు కోర్టు అనుమతి ఉందంటూ మనోజ్ చెప్పినా సెక్యూరిటీ సిబ్బంది అతడిని లోపలికి అనుమతించలేదు. దీంతో మనోజ్ గేటు బయటే బైఠాయించి నిరసనకు దిగారు. మనోజ్ భార్య మౌనిక సైతం అక్కడికి వచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు మోహన్‌బాబు ఇంటి వద్ద భారీగా బలగాలను మోహరించారు. ఇతరులు అక్కడికి వెళ్లకుండా మోహన్ బాబు ఇంటికి రెండు కిలోమీటర్ల దూరంలోనే ఆపేస్తున్నారు. మనోజ్ గేటు బయట ఆందోళనకు దిగడంతో అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది.

### కారు పోయిందంటూ ఫిర్యాదు..

తన కారు పోయిందని మంచు మనోజ్ మంగళవారం నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 1వ తేదీన తన పాప పుట్టిన రోజు వేడుకల నిమిత్తం రాజస్థాన్ వెళ్లగా ఇదే అసరాగా తన సోదరుడు విష్ణు 150మందితో జల్‌పల్లిలోని ఇంట్లోకి ప్రవేశించి తన సామగ్రి ధ్వంసం చేశారని మనోజ్ ఆరోపించారు. తన కార్లలో కొన్నిటిని టోయింగ్‌వాహనంతో లాక్కెళ్లి రోడ్డుమీద వదిలేశారని, మరికొన్నిటిని దొంగిలించి విష్ణు ఇంట్లో పార్క్ చేశారన్నారు. అలాగే తన సెక్యూరిటీ సిబ్బందిపై కూడా దాడి చేశారని పేర్కొన్నారు.

### అనుమతి ఉన్నా రానివ్వడం లేదు.

మోహన్ బాబు ఇంటి ఎదుట బైఠాయించిన మనోజ్ మీడియాతో మాట్లాడుతూ.. తనకు ఆస్తిలో చిల్లిగవ్వ వద్దని నాన్నకు ఎప్పుడో చెప్పానన్నారు. డిసెంబర్ నుంచి గొడవలు జరుగుతుంటే ఇప్పటివరకు పోలీసులు ఒక్క చార్జిషీట్ ఫైల్ చేయలేదని, కొంతమంది ప్రవేట్ వ్యక్తులు కత్తులు, కర్రలతో మాపైకి వచ్చినా అన్ని ఆధారాలు ఇచ్చినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మనోజ్ ఆరోపించారు. తనకు జల్‌పల్లిలోని ఇంట్లో ఉండేందుకు హైకోర్టు అనుమతి ఇచ్చిందని, అయితే వాళ్లు అనుమతి లేదని ఇంట్లోకి రానివ్వడం లేదని మనోజ్ ఆవేదన వ్యక్తం చేశారు.

## బీసీల రాజ్యాధికారమే లక్ష్యం

### మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నర్సింగ్‌రావు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నర్సింగ్‌రావు తదితరులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 9: బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా 'మన ఆలోచన సాధన సమితి' పనిచేస్తుందని సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగ్‌రావు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. సుదీర్ఘ కాలం పాటు బీజేపీ, దాని అనుబంధ సంఘాల్లో పనిచేస్తున్నానని, బీసీల కోసం వాటిని వదులుకొని వచ్చానన్నారు. ఈ మేరకు బీజేపీ అధినాయకత్వానికి తన రాజీనామా లేఖ పంపించినట్లు నర్సింగ్‌రావు తెలిపారు. బీసీల ఐక్యత, హక్కుల సాధనే లక్ష్యంగా ఈనెల 15న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 'మన ఆలోచన సాధన సమితి' ఆవిర్భావ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభకు బీసీ మేధావులు, కవులు, రచయితలు, కళాకారులు, ఉద్యోగులు, బీసీలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. అనంతరం సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సమితి నాయకులు గడ్డం నర్సింహగౌడ్, దొంత ఆనందం నేత, నేరేళ్ల దేవేందర్, పూస నరసింహ బెస్త, చుక్కల సత్యనారాయణతో కలిసి నర్సింగ్ రావు ఆవిష్కరించారు.

# రేపటి నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో రైతు మహోత్సవం



రైతు మహోత్సవం సేంద్రియ మేల– 2025 కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

అబిడ్స్ ఏప్రిల్ 9: అగ్రి హార్టికల్చర్ సొసైటీ, ఎగ్జిబిషన్ సొసైటీ ఎకనామిక్ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో రైతు మహోత్సవం సేంద్రియ మేల–2025 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అగ్రి ఆర్టికల్చర్ సొసైటీ ప్రతినిధులు డాక్టర్ రవీంద్రబాబు, వీరభద్రరావు, రంగారావు, సూర్యకళ తెలిపారు. ఈ కార్యక్రమం14వ తేదీ వరకు(నాలుగు రోజులపాటు) నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రైతులకు మరిన్ని సేవలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, వ్యవసాయంలో సాంకేతికత అధిక దిగుబడి వంగడాలు, సేంద్రియ పంటలు, నీటిపారుదల బిందు సేద్యం, పౌల్ట్రీ, పాడి, మత్స్య, చేనేత, వ్యవసాయానికి ఉపయోగపడే డ్రోన్లు ఆధునిక యంత్ర పరికరాల రంగాలలో పూర్తి సమాచారాన్ని ఈ మహోత్సవంలో ఏర్పాటు చేసే స్టాల్ల ద్వారా ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని రైతు సోదరులు, విద్యార్థులు ఈ రైతు మహాసభ కార్యక్రమంలో పాల్గొంటారని వీరికి వివిధ విభాగాల శాస్త్రవేత్తలు అనేక రకాల మెలుకువలను వివరిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ సొసైటీ కార్యాలయంలో రైతు మహోత్సవానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. రైతులతో పాటు విద్యార్థులు పాల్గొని శాస్త్రవేత్తల నుంచి సలహాలు, సూచనలు తీసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రి హార్టికల్చర్ సొసైటీ ఎగ్జిబిషన్ సొసైటీ ఎకనామిక్ కమిటీ ప్రతినిధులుఎగ్జిబిషన్ సొసైటీ ఎకనామిక్ కమిటీ ఉపాధ్యక్షులు ఆదిత్య మార్గం, సెక్రటరీ జీవీ రంగారెడ్డి, డాక్టర్ సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

### టీయూడబ్ల్యూ జే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ



నూతన సభ్యులతో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ

మెహదీపట్నం, ఏప్రిల్ 9: హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ప్రస్తుత ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీయూడబ్ల్యూ జే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ డిమాండ్ చేశారు. బుధవారం నాంపల్లిలోని టీఎన్జీవో భవన్లో జరిగిన టీయూడబ్ల్యూజే హైదరాబాద్ అడహక్ కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ జర్నలిస్టులకు నివాస స్థలాలు అందించే విషయంలో ప్రభుత్వాలు అలసత్వ వైఖరిని అవలంభిస్తున్నాయని, వెంటనే ప్రస్తుత ప్రభుత్వం దీనిపై స్పందించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. గత కొంతకాలంగా జర్నలిస్టుల హెల్త్ కార్డులు కార్పొరేట్ వైద్యశాలల్లో పనిచేయటం లేదని, ఈహెచ్ఎస్ తోపాటు జేహెచ్ఎస్ కూడా అన్ని ఆసుపత్రిలో చెల్లుబాటు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అక్రిడేషన్ కార్డులను తగ్గించే దిశగా ఆలోచనలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇదే జరిగితే ఆందోళన బాట తప్పదని ఆయన హెచ్చరించారు. టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతి సాగర్ మాట్లాడుతూ.. తెలంగాణ జర్నలిస్టు ఫోరం ఏర్పడి ఈ ఏడాది మే 31 నాటికి 25 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా రజితోత్సవాలు జరుపుకునే దిశగా సంఘం ఆలోచిస్తుందని, అన్ని జిల్లా బాధ్యులతో చర్చించి త్వరలో నిర్ణయాన్ని వెల్లడిస్తామని తెలిపారు. ఈ మధ్యకాలంలో చత్తీస్‌గఢ్ లాంటి రాష్ట్రంలో జర్నలిస్టులకు పెన్షన్ విధానాన్ని పెంచి మరి అమలు చేస్తున్నారని, తెలంగాణ రాష్ట్రంలో కూడా ఈ విధానాన్ని అందుబాటులోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి పి. యోగానంద్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి రమణ కుమార్, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు అవ్వారి భాస్కర్, రాష్ట్ర నాయకురాలు కవిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా టీయూడబ్ల్యూజే నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.

### టీయూడబ్ల్యూజే నూతన కార్యవర్గం..

జిల్లా టీయూడబ్ల్యూజే నూతన కమిటీ అధ్యక్షులుగా: సీహెచ్ రాకేష్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎం.మల్లేష్, వి అజయ్, సువర్ణల, ప్రధాన కార్యదర్శిగా: ఎస్ సోమేశ్వర్, సంయుక్త దర్శులుగా రమేష్, ఆర్ ప్రవీణ్ కుమార్, కార్యనిర్వాహక కార్య దర్శులుగా ఎస్ వెంకట్, ఆర్ వెంకట్, కోశాధికారిగా బాపూరావు, కార్యవర్గ సభ్యులుగా సంతోష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శిగా, హైదరాబాద్ జిల్లా ఇన్చార్జిగా నవీన్ కుమార్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ ప్రకటించారు.




ఈ నెల 18,19, 20 తేదీల్లో హైటెక్ సిటీలోని నోవాటెల్ హోటల్‌లో జరగనున్న హైలైఫ్ జువెల్ ఎగ్జిబిషన్‌కు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించిన మోడల్స్

# ఊబకాయంతో జాగ్రత్త సుమా

- 65శాతం మందిలో ఫ్యాటీ లివర్
- 26 శాతం మందిలో హైపర్‌టెన్షన్
- 23శాతం మందిలో మధుమేహం
- మద్యం సేవించని వారిలోనూ లక్షణాలు
- అపోలో 'హెల్త్ ఆఫ్ ద నేషన్ 2025' నివేదికలో వెల్లడి



సిటీబ్యూరో, ఏప్రిల్09, (నమస్తే తెలంగాణ): ఒకప్పుడు మద్యం సేవించే వారికి మాత్రమే ఆందోళన కలిగించేదిగా పరిగణించబడిన ఫ్యాటీ లివర్ ఇప్పుడు ఊబకాయం, మధుమేహం, రక్తపోటుతో ముడి పడి ఉన్న ముఖ్యమైన ఆరోగ్య సమస్యగా ఉద్భవించింది. మద్యం సేవించని 85శాతం మందిలో ఈ సమస్య వృద్ధి చెందడం ఆందోళన కలిగిస్తోంది. అపోలో హాస్పిటల్స్ 'హెల్త్ ఆఫ్ ద నేషన్ 2025 (హెచ్ఓఎన్ –2025) లక్షణాల కోసం వేచి చూడకండి – నివారణను మీ ప్రాధాన్యతగా మలుచుకోండి' నివేదికను విడుదల చేసింది. అపోలో హాస్పిటల్స్ దేశవ్యాప్తంగా 25 లక్షల మందికి పైగా వ్యక్తుల ఆరోగ్య పరీక్షల ఆధారంగా ఈ నివేదిక రూపొందించి అందులోని ప్రధాన అంశాలు వెల్లడించింది. లక్షలాది మంది ఎలాంటి లక్షణాలు కనిపించనప్పటికీ దీర్ఘకాలిక అనారోగ్య స్థితిని కలిగి ఉంటున్నారని, 26 శాతం మందిలో హైపర్ టెన్షన్, 23శాతం మందిలో మధుమేహం గుర్తించినట్లు పేర్కొన్నారు. నివారణ పరీక్షలు పెరగటం లేదని, 2019లో పది లక్షల పరీక్షలు నిర్వహించగా, 2024కు వచ్చేసరికి కేవలం 25లక్షలకు మాత్రమే చేరుకున్నట్లు వెల్లడించింది. హెచ్ఓఎన్ –2025 నివేదికలో వెల్లడించిన అంశాలను నిర్మాణాత్మక క్లీనిక్‌ల పరిశీలనలు, అపోలో హాస్పిటల్స్ , డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లు, వెల్‌నెస్ కేంద్రాలలో డీ–ఐడెంటిఫైడ్ ఎల్క్ట్రానిక్ మోడల్ రికార్డ్స్ గుండా వెల్లడించడం గమనార్హం. ఫ్యాటీ లివర్ రోగాలు, మెనోపాజ్ తరువాత వచ్చే ఆరోగ్య సమస్యలు, బాల్యదశలో వచ్చే ఊబకాయం వంటి వాటిని వెల్లడించారు.

### మద్యపానం చేయని వారిలోనూ..

2,57,199 మందిలో 65శాతం మంది ఫ్యాటీ లివర్‌తో బాధపడుతుండగా వీరిలో 85శాతం మంది మద్యపానం చేయనివారే ఉన్నారు. 46శాతం మందిలో ఎలాంటి లక్షణాలు లేకున్నప్పటికీ అథెరోస్క్లెరోసిస్ లక్షణాలు కనిపిస్తున్నాయి. మధుమేహం ఒక్కసారిగా 14శాతం నుంచి 40శాతానికి పెరగటం, ఊబకాయం 76శాతం నుంచి 86 శాతానికి పెరిగింది. కళాశాల విద్యార్థులలో 28శాతం మంది అధిక బరువు, ఊబకాయంతో బాధపడుతున్నారు. 19శాతం మంది ప్రీ–హైపర్‌టెన్సివ్‌గా ఉన్నట్లు గుర్తించారు. 4,50,000 కంటే ఎక్కువ మంది వ్యక్తులలో 26శాతం కంటే ఎక్కువ మంది అధిక రక్తపోటుతో బాధపడుతున్నారు. 77శాతం మంది మహిళలు, 82శాతం మంది పురుషులు విటమిన్–డీ లోపం కలిగి ఉన్నారు. 53,000 మందిలో 24శాతం మందికి అబ్స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా (ఓఎస్ఏ) ప్రమాదం ఎక్కువగా ఉంది. 59శాతం మందిలో డయాబెటిస్ మార్కర్ తగ్గితే , 51శాతం మందిలో బీపీ తగ్గింది , 47శాతం మంది ప్రవర్తనా పరమైన మార్పుల కారణంగా బరువు తగ్గారు.

### ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

ప్రతి ఇంటిలోనూ ఆరోగ్యానికి అమిత ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సంతోషకరమైన, ఆరోగ్యవంతమైన కుటుంబాలను సృష్టించే అవకాశాన్ని పొందేలా భారత దేశం నిలవాలి. నివారణ ఆరోగ్యం అనేది ఇక ఎంతమాత్రమూ భవిష్యత్ కోరిక కాదు.అది నేటి దేశ శ్రేయస్సుకుమూలం. ఈ నివేదిక , వేగంగా మనం చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని, లోతుగా పరీక్షలు చేయించుకోవాల్సిన ఆవశ్యకతను, ప్రతి ఒక్కరికీ ఈ అంశాల పట్ల అవగాహన కల్పించడంతో పాటుగా తగిన అవకాశాలను కల్పించాల్సిన సమిష్టి బాధ్యతను వెల్లడిస్తుంది.

**– డాక్టర్ ప్రతాప్ రెడ్డి, అపోలో హాస్పిటల్స్ చైర్మన్**

## డ్యూటీలో మద్యం తాగిన వార్డ్‌బాయ్

### ఎర్రగడ్డ ఛాతీ ఆసుపత్రిలో ఘటన



వెంగళరావునగర్, ఏప్రిల్ 9 : చీకట్లో ఎవరొస్తారు..ఏం చేసినా ఏం కాదనే తెగింపుతో సర్కారీ దవాఖానలో మద్యం తాగుతూ పట్టుబడ్డాడో వార్డ్ బాయ్. ఆక్సిజన్ ప్లాంట్‌లోని బెడ్ నే టేబుల్‌గా మార్చేసి మద్యం బాటిల్, గ్లాసులు పెట్టుకుని మందేస్తూ చిక్కాడు. ఎర్రగడ్డ ప్రభుత్వ ఛాతీ దవాఖానాలో అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఎర్రగడ్డ ప్రభుత్వ ఛాతీ దవాఖానాలో ఆక్సిజన్ ప్లాంట్ వద్ద వార్డ్ బాయ్‌గా విధులు నిర్వహించే మహ్మద్ సాదిక్ అలీ (28).. ఇతను నాలుగో తరగతి ఉద్యోగి. ఇటీవల నైట్ డ్యూటీకు వచ్చిన సాదిక్ అలి అర్ధరాత్రి వేళ దవాఖానాలోని ఆక్సిజన్ ప్లాంట్‌లోని బెడ్ పై మద్యం సేవిస్తుండగా అక్కడి రోగి బంధువు.. ఈ తతంగాన్ని వీడియో రికార్డ్ చేశాడు. అనంతరం అతడు ఆ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది. ఈ విషయమై ఎర్రగడ్డ చెస్ట్ దవాఖానా సూపరింటెండెంట్ శ్రవణ్ కుమార్నురను వివరణ కోరగా.. దవాఖానలో మద్యం తాగిన వార్డ్ బాయ్ సాదిక్ అలీని విధుల నుంచి తప్పించామని..చార్జ్ మెమో ఇచ్చామని పేర్కొన్నారు.